క్లుప్తంగా

సిరిసిల్ల బందలో ఆక్రమణలు అడ్డుకోవాలి

టెక్కలి: కోటబొమ్మాళి మండలం కొత్తపల్లి గ్రామంలో ప్రభుత్వానికి చెందిన సిరిసిల్ల బందలో కొంతమంది చేస్తున్న ఆక్రమణలను అడ్డుకోవాలని గ్రామానికి చెందిన దుబ్బ సింహాచలం అధికారులకు ఫిర్యాదు చేశారు. చెరువు గర్భంలో సుమారు 10 సెంట్లు మేరకు స్థలాన్ని ఆక్రమిస్తూ అక్రమ నిర్మాణాలు చేస్తున్నారని దీనిపై ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని విన్నవించారు.

ప్రకృతి వ్యవసాయానికి పాలేకర్ ఆదర్శం


సుభాష్ పాలేకర్‌తో రైతు ఖోగయ్య

ఇచ్ఛాపురం రూరల్: ప్రకృతి వ్యవసాయానికి పద్మశ్రీ సుభాష్ పాలేకర్ ఆదర్శనీయుడని వైఎస్సార్‌సీపీ నాయకుడు, రైతు చినపాన ఖోగయ్య అన్నారు. ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తులపై నాసిక్, షిర్డీలో జరుగుతున్న శిక్షణ కార్యక్రమంలో ఖోగయ్య, ఆయన కుమారుడు మోహన్‌తో కలసి పాల్గొన్నారు. తక్కువ విస్తీర్ణంలో సహజ వ్యవసాయం ద్వారా అధిక లాభాలు పొందడం, మంచి దిగుబడులు సాధించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మార్గదర్శకాలను శిక్షణ కార్యక్రమంలో వివరిస్తున్నట్లు తెలిపారు.

మృతుని కుటుంబానికి పరామర్శ

సోంపేట: బారువ కొత్తూరు గ్రామానికి చెందిన వలిశెట్టి తులసి ఇటీవల మృతి చెందారు. దీంతో ఆమె కుటుంబసభ్యులను వైఎస్సార్‌సీపీ నాయకుడు, సీడాప్ మాజీ చైర్మన్ శ్యాంప్రసాద్ రెడ్డి సోమవారం పరామర్శించారు కుమార్తెను కోల్పోయిన మాజీ సైనికుడు వలిశెట్టి హేమ రాజును ఓదార్చారు. వైస్‌ఎంపీపీ గురాల శ్రీను, ఉప సర్పంచ్ రాజు, అమరలోకనాథం ఉన్నారు.

ఆస్తిపన్ను చెల్లించాలి

ఇచ్ఛాపురం టౌన్: ఆస్తిపన్ను విధిగా చెల్లించాలని మున్సిపల్ కమిషనర్ ఎన్.రమేష్ కోరారు. రాష్ట్ర ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఆస్తి పన్ను బకాయిదారుల జాబితాను ఆయా సచివాలయాల్లో, పురపాలక సంఘ కార్యాలయంలో ఉంచినట్టు సోమవారం తెలిపారు. పన్నులు చెల్లించి పట్టణాభివృద్ధికి సహకరించాలని కోరారు.

తుప్పలు తొలగించారు


ఉపవిద్యుత్ కేంద్రం అవరణలో పిచ్చిమొక్కలు తొలగించిన దృశ్యం

సాక్షి ఎఫెక్ట్...

కవిటి: బొరివంకలోని ఉప విద్యుత్ కేంద్రంలో పేరుకుపోయిన తుప్పలను సోమవారం తొలగించారు. 'తుప్పల మధ్య ఉపవిద్యుత్ కేంద్రం' శీర్షికతో సోమవారం 'సాక్షి'లో ప్రచురితమైన వార్తకు సంబంధిత అధికారులు స్పందించారు. ఉపవిద్యుత్ కేంద్రం ఆవరణలో పెరిగిపోయిన పిచ్చిమొక్కలను కొంతవరకూ తొలగించి కాల్చివేశారు.

బెట్టింగ్ యాప్‌లకు దూరంగా ఉండాలి


బెట్టింగ్‌యాప్‌లపై అవగాహన కల్పిస్తున్న డీటీ మురళి తదితరులు


పలాస: బెట్టింగ్ యాప్‌లకు యువత దూరంగా ఉండాలని వజ్రపుకొత్తూరు మండల డిప్యూటీ తహసీల్దార్ కె.మురళీ అన్నారు. బెట్టింగ్ యాప్స్ వద్దు–చదువే ముద్దు అని వ్యాఖ్యానించారు. కాశీబుగ్గ మూడు రోడ్లు కూడలి వద్ద సోమవారం బెట్టింగ్ యాప్స్ వల్ల కలిగే అనర్థాలపై ప్లకార్డులతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శ్రీకాకుళానికి చెందిన దేశ సైనికుడు ముకుంద బెట్టింగ్ యాప్స్ వల్ల కలిగే అనర్థాలను వివరిస్తూ అవగాహన కల్పిస్తున్నారని.. అతన్ని ఆదర్శంగా తీసుకోవాలని చెప్పారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు, పలాస ఏపీఎన్జీవోస్ అధ్యక్షుడు బోనెల గోపాల్, దిలీప్, జీకే ప్రసాద్, సంపతరావు జయరాం, దివాకర్, కార్తీక్, శేఖర్ ఉన్నారు.

తప్పుఒప్పులు సరిచేయాలి

సోంపేట: ఒడియా పాఠ్యపుస్తకాలను నిశితంగా పరిశీలించి తప్పుఒప్పులను సరిచేయాలని విద్యాశాఖాధికారి ఎస్.జొరాడు అన్నారు. ఆంధ్రప్రదేశ్ ఒడియా పాఠ్యపుస్తకాలు అనువాదం .. తప్పుఒప్పులను సరిచేసే వర్క్‌షాప్‌ను సోంపేటలో సోమవారం ప్రారంభించారు. కోర్స్ డైరెక్టర్ దుర్గాప్రసాద్ చౌదరి, కోఆర్డినేటర్ మురళి మాట్లాడుతూ.. లాంగ్వేజ్ పాఠ్యపుస్తకాల అనువాదం, కొత్తగా సంయుక్తమైన విషయాలు నిశితంగా పరిశీలించాల్సిన అవసరం ఉందన్నారు. కార్యక్రమంలో ఒడియా టీచర్స్ అసోసియేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రామహరి పాడి, ప్రధాన కార్యదర్శి బృందావన్ దొళాయి పాల్గొన్నారు.

గుట్టుచప్పుడు కాకుండా

పీకేస్తున్నారు!



కోసంగిపురంలోని జగనన్న కాలనీ (ఇన్‌సెట్లో) కోసంగిపురం జగనన్న కాలనీలో ఈ నెల ఒకటో తేదీన విద్యుత్ మీటర్‌ను తొలగిస్తున్న సిబ్బంది

- ఉచిత విద్యుత్ కనెక్షన్లకు మంగళం
- వినియోగం లేదంటూ తొలగిస్తున్న వైనం
- జగనన్న కాలనీలే టార్గెట్

కాశీబుగ్గ:

రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం మరో దుశ్చర్యకు పాల్పడుతోంది. గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో నిర్మించిన జగనన్న కాలనీల్లోని ఇళ్లకు ఏర్పాటు చేసిన ఉచిత విద్యుత్ కనెక్షన్లను గుట్టుచప్పుడు కాకుండా తొలగించేస్తున్నారు. వినియోగంలో లేవనే నెపంతో విద్యుత్ కనెక్షన్, బోర్డులు, మీటర్లను సంబంధిత సిబ్బంది పీకేస్తున్నారు. నిరుపేదలు ఇళ్లు కట్టుకుంటున్నారని అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎటువంటి నగదు చెల్లించకుండా ఉచితంగా విద్యుత్ కనెక్షన్లను అందించారు. అయితే కొన్ని ఇళ్లు నిర్మాణ దశలో, మరికొన్ని ప్రారంభానికి దగ్గరగా, ఇంకొన్ని పనులు నిలిచిపోయినవాటిని గుర్తించి తొలగిస్తున్నారు. వాస్తవంగా విద్యుత్ కనెక్షన్ పొందాలంటే కార్యాలయం చుట్టూ తిరిగి రూ. నాలుగు నుంచి ఐదు వేల రూపాయల వరకూ ఖర్చు చేయాల్సి ఉంటుంది. అయితే గత ప్రభుత్వం వీటిని ఉచితంగా సమకూర్చింది. అలాంటి వాటిని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత వినియోగంలో లేవనే కారణాన్ని చూపించి లబ్ధిదారులకు కనీస సమాచారం కూడా ఇవ్వకుండా తొలగించేస్తున్నారు. ముఖ్యంగా పాత విద్యుత్ ఏఈల ఖాతాలలో వీటి వివరాలు ఉండిపోవడంతో వారంతా జిల్లా వ్యాప్తంగా ఉన్నటువంటి జగనన్నకాలనీలో మాత్రమే కనెక్షన్లను తొలగిస్తున్నారు. ఆర్థిక సమస్యలతో పనులు నిలిపివేసిన అనేక మందికి తెలియకుండానే తొలగిస్తుండడంతో వారంతా ఆందోళన చెందుతున్నారు.

గత ప్రభుత్వ హయాంలో..


గత ప్రభుత్వం ఉచితంగా అందించిన విద్యుత్ కనెక్షన్ కిట్

సాధారణంగా విద్యుత్ కనెక్షన్ కావాలంటే సంబంధిత కార్యాలయం చుట్టూ తిరగాలి. నగదు చెల్లించి అధికారుల నుంచి అనుమతులు పొందాలి. అయితే గత వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో ఈ ప్రక్రియ చాలా సులభంగా పూర్తయ్యేది. దరఖాస్తు చేసుకున్న రోజుల వ్యవధిలోని విద్యుత్ కనెషన్‌ను మంజూరు చేసేవారు. విద్యుత్ శాఖ ఏఈ, లైన్‌మన్ వచ్చి సంబంధిత జిరాక్ కాగితాలను అడిగి మరీ తీసుకుని రెండు రోజుల్లో కనెక్షన్ ఏర్పాటు చేసేవారు. ప్రభుత్వమే ఉచితంగా విద్యుత్ శాఖతో కలిసి బోర్డు, మీటరు, ఎంసీబీ, న్యూట్రల్ లింక్, ఎర్త్ వైరు, నేలలో పాతిన ఎర్త్‌పైపు, స్తంభం నుంచి ఇంటి వరకు కావాల్సిన సర్వీసు వైరు, సపోర్టుగా ఉండే తీగ, సర్వీసు వైరుకు ఉండే సపోర్టు పైపు, డ్రిల్లింగ్ చేయబడిన మిషన్‌తో కావాల్సిన బోల్టులు, క్లిప్‌లను కూడా ఉచితంగానే సమకూర్చేది.

పలాస జగనన్న కాలనీలో..

పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని పేదలకు రామక్రిష్ణాపురం రెవెన్యూ పరిధి కోసంగిపురం కూడలి వద్ద ఏర్పాటు చేసిన జగనన్న కాలనీలో గృహాలను మంజూరు చేశారు. రెండు వేల మందికి పైగా లబ్ధిదారులకు స్థలాలను గత సర్కార్ కేటాయించింది. వీటిలో సుమారు 1500 విద్యుత్ కనెక్షన్లను ఉచితంగా సమకూర్చారు. అలాగే పలాస డివిజన్ పరిధిలో 5089 ఇళ్లకు విద్యుత్ కనెక్షన్లను అమర్చారు. అయితే వీటిలో కొన్ని ఇళ్లలో విద్యుత్ వినియోగం లేదని, నిర్మాణాలు పూర్తికాలేదనే కారణంతో గుట్టుచప్పుడుకాకుండా విద్యుత్ శాఖ అధికారులు కనెక్షన్లను తొలగిస్తున్నారు. తిరిగి విద్యుత్ కనెక్షన్ కావాలంటే సుమారు ఐదు వేల రూపాయల వరకూ ఖర్చవుతోందని లబ్ధిదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. విద్యుత్ సిబ్బంది మీటర్లను తొలగిస్తున్నప్పటికీ ఏమీ చేయలేక మౌనంగా ఉండిపోతున్నారు. ఈ విషయాన్ని పలాస విద్యుత్‌శాఖ ఈఈ యగ్నేశ్వరరావు వద్ద ఫోన్‌లో ప్రస్తావించగా మాట్లాడకుండా దాటవేశారు.

టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ


రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పీ మహేశ్వరరెడ్డి

టెక్కలి రూరల్: టెక్కలి పోలీస్‌స్టేషన్‌ను జిల్లా ఎస్పీ కేవీమహేశ్వరరెడ్డి సోమవారం సందర్శించారు. స్టేషన్‌తోపాటు పరిసరాలను పరిశీలించి శుభ్రంగా ఉంచాలని సిబ్బందికి సూచించారు. స్టేషన్‌లోని రిసెప్షన్ వద్ద రికార్డులు పరిశీలించారు. స్టేషన్‌కు వచ్చే ప్రజల సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇవ్వాలన్నారు. పెండింగ్‌లో ఉన్న ముఖ్యమైన కేసులకు సంబంధించి సీడీ ఫైల్‌లను పరిశీలించి దర్యాప్తు, కేసుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విజిబుల్ పోలీసింగ్‌లో భాగంగా కొత్త ఎం.వి. చట్టాలు, ట్రాఫిక్ నిబంధనలు, రోడ్డు ప్రమాదాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. గంజాయ్, సైబర్ నేరాలపై ప్రత్యేక దృష్టి సారించి వాటి నివారణకు చర్యలు తీసుకోవాలని సూచించారు. రాత్రి గస్తీని మరింత ప్రతిష్టం చేసి దొంగతనాల నివారణకు చర్యలు తీసుకోవాలని సీఐ విజయ్‌కుమార్‌ను ఆదేశించారు.

విద్యార్థినులకు వ్యాసరచన పోటీలు

సోంపేట: బారువ ప్రభుత్వ డిగ్రీ కళాశాల, సోంపేట సంస్కారభారతి డిగ్రీ కళాశాల విద్యార్థినులకు పోలీసుల ఆధ్వర్యంలో వ్యాసరచన పోటీలు సోమవారం నిర్వహించారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకుని లింగసమానత్వాన్ని ప్రోత్సహించడం, పితృస్వామ్య నిబంధనలను సవాల్ చేయడంలో పురుషుల ప్రమేయం అనే అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించినట్లు సోంపేట, బారువ ఎస్సైలు లవరాజు, హరిబాబునాయుడు తెలిపారు. విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

మహిళలు టోల్‌ఫ్రీ నంబర్లు తెలుసుకోవాలి


మాట్లాడుతున్న ఎస్సై కృష్ణప్రసాద్

మందస: మహిళలు టోల్‌ఫ్రీ నంబర్ల గురించి తెలుసుకోవాలని మందస ఎస్సై కె.కృష్ణప్రసాద్ అన్నారు. బాలిగం గ్రామంలోని ఆదిత్య కళాశాలలో అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని మహిళల రక్షణ అనే అంశంపై విద్యార్థినులకు సోమవారం వ్యాచరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహిళల కోసం అమలు చేస్తున్న చట్టాలు, టోల్‌ఫ్రీ నంబర్ల గురించి అవగాహన కల్పించారు. కళాశాల ప్రిన్సిపాల్ బి.ప్రవీణ్, హరికృష్ణ ప్రసాద్, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు జి. సోమేశ్వరరావు, రవిశంకర్, కృష్ణారావు, వైస్ ప్రిన్సిపాల్ బమ్మిడి మోహనరావు పాల్గొన్నారు.

అన్నపూర్ణమ్మకు జలాభిషేకం



ఇచ్ఛాపురం మండలం బొడ్డబడ గ్రామ దేవత అన్నపూర్ణమ్మ నూతన ఆలయ ప్రతిష్ట కార్యక్రమాన్ని గ్రామస్తులు సోమవారం ఘనంగా నిర్వహించారు. వేద మంత్రాల మధ్య మహిళలు స్థానిక బహుదానది నుంచి కలశాలతో జలయాత్ర సాగించి అమ్మవారికి అభిషేకించారు. ఎంపీపీ బోర పుష్ప, వైస్ ఎంపీపీ దువ్వ వివేకానంద రెడ్డి, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు పాతిర్ల రాజశేఖరరెడ్డి, సీడాప్ మాజీ చైర్మన్ సాడి శ్యామ్ ప్రసాద్‌రెడ్డి, సర్పంచ్‌లు నర్తు ప్రసాద్ యాదవ్, సంతోష్ మండల, కారంగి త్రినాథ్‌రెడ్డి, సాడి సారధిరెడ్డి, లిట్టూపాడి, ఇసురు తులసీరామ్, పిట్ట బాలయ్య, నగిరెడ్ల చిరంజీవి, మాజీ ఎంపీపీ కారంగి మోహనరావు, ప్రియా నాయక్, ఉదయ్ బెహరా అమ్మవారిని దర్శించుకున్నారు. –ఇచ్ఛాపురం రూరల్

ఫిజియోథెరపీ సేవలు



అత్యవసరాల పిల్లల కోసం ఉచితంగా అందజేస్తున్న ఫిజియోథెరపీ సేవలను సద్వినియోగం చేసుకోవాలని కోటబొమ్మాళి ఎంఈవో ఎల్.వి. ప్రతాప్ సూచించారు. స్థానిక భవితా కేంద్రంలో ఫిజియోథెరపిస్టు గేదెల కిరణ్‌కుమార్ నిర్వహిస్తున్న సేవలను సోమవారం పరిశీలించారు. అత్యవసరాల పిల్లలకు థెరఫీ సేవలు వరమన్నారు. భవిత కేంద్రంలో సేవలపై ఎంఈవో సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బంది ఎ.దేవమణి ఉన్నారు. –టెక్కలి

ఆక్రమణల తొలగింపు



టెక్కలిలోని పట్టుమహాదేవి కోనేరు గట్టుపై ఉన్న ఆక్రమణలను తహసీల్దార్ రవికుమార్ ఆధ్వర్యంలో జేసీబీతో సోమవారం తొలగించారు. కొంతకాలంగా ఇక్కడ నడుస్తున్న వాటర్ ప్లాంట్‌ను సైతం తొలగించారు. మరికొన్ని ఆక్రమణలను సైతం తొలగించి పట్టుమహాదేవి కోనేరు గట్టుని సుందరంగా తీర్చిదిద్దుతామని తహసీల్దార్ తెలిపారు. – టెక్కలి రూరల్

వన్యప్రాణులను సంరక్షించుకోవాలి


మాట్లాడుతున్న చంద్రశేఖరరావు

పలాస: పర్యావరణ సమతుల్యత, జీవ వైవిధ్యం చాలా ముఖ్యమని.. అందులో భాగంగా వన్య ప్రాణులను సంరక్షించుకోవడం మరింత అవసరమని పలాస పశుసంవర్ధక శాఖ సహాయ సంచాలకులు పి.చంద్రశేఖర్ చెప్పారు. పలాస మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ప్రపంచ వన్య ప్రాణుల దినోత్సవాన్ని ఘనంగా జరిపారు. ఎంపీడీవో కె.వసంతకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ.. డిఫారెస్టు స్టేషన్ వల్ల మానవ మనుగడ ప్రశ్నార్థకమవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. జీవ వైవిధ్యాన్ని కాపాడుకోవాలని చెప్పారు. ప్రకృతిని అలాగే ఉంచాలని..దాన్ని నాశనం చేయకూడదన్నారు. మొక్కలను నాటి పర్యావరణాన్ని కాపాడుకోవాలని చెప్పారు. అడవులు అంతరించిపోతే ఆవాసాలు నాశనం, వాతావరణ మార్పు వంటివి సంభవిస్తాయన్నారు. కార్యక్రమంలో గ్రీన్ ఆర్మీ అధ్యక్షుడు బోనెల గోపాల్, పంచాయతీ విస్తరణాధికారి మెట్ట వైకుంఠరావు, ఇరిగేషన్ అధికారి పి.శ్రీనివాసరావు, కొర్ల మన్మథరావు, సంపత్‌రావు, ఫారెస్టు అధికారి ఉమామహేశ్వరరావు పాల్గొన్నారు.

తాబేళ్లను రక్షించాలి


తీరంలో అవగాహన కల్పిస్తున్న మెరైన్ పోలీసులు

సోంపేట: సముద్ర తాబేళ్లను మత్స్యకారులు, యువత రక్షించాలని మెరైన్ సీఐ రమేష్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రపంచ వన్యప్రాణ సంరక్షణ దినోత్సవం సందర్భాన్ని పురస్కరించుకుని బారువ కొత్తూరు తీరప్రాంతంలో మెరైన్‌పోలీస్, అటవీ శాఖ, ట్రీ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మత్స్యకారులు, యువతకు తాబేళ్ల సంరక్షణపై అవగాహన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ.. తాబేళ్లగుడ్లను భద్రపరచడం, వాటిని పిల్లలుగా పొదిగించడం, తిరిగి వాటిని సముద్రంలో విడిచిపెట్టడం, తాబేళ్ల వలన ఉపయోగాపై అవగాహన కల్పించారు. తాబేళ్లకు నష్టం కలిగిస్తే చట్టపరమైన చర్యలకు బాధ్యలవుతారన్నారు. అటవీశాఖ సిబ్బంది సంతోష్, ట్రీ ఫౌండేషన్ కోఆర్డినేటర్ సోమేశ్వరరావు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీగా గాదె విజయంపై హర్షం


కంచిలి: హర్షం వ్యక్తం చేస్తున్న పీఆర్‌టీయూ ప్రతినిధులు


కవిటి: విజయోత్సవంలో కవిటి మండల బహుజన టీచర్స్ ప్రతినిధులు

కంచిలి: ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో కూటమి మద్దతు అభ్యర్థి పాకలపాటి రఘువర్మపై పీఆర్‌టీయూ మద్దతు ఇచ్చిన గాదె శ్రీనివాసులు నాయుడు విజయం సాధించడంపై మండల పీఆర్‌టీయూ ప్రతినిధులు సోమవారం హర్షం వ్యక్తం చేశారు. శ్రీనివాసులునాయుడు వరుసగా మూడు సార్లు విజయం సాధించడం గర్వించదగ్గ విషయమని అన్నారు. హర్షం వ్యక్తం చేసిన వారిలో మండల సంఘం ప్రతినిధులు దుద్ది బాలరాజు, యారడి శంకరరావు, సాంబమూర్తి తదితరులున్నారు.

కవిటి: ఎమ్మెల్సీగా గాదె శ్రీనివాసులునాయుడు విజయం ఉపాధ్యాయుల ఐక్యతకు నిదర్శనమని మండల బహుజన టీచర్స్ సంఘం ప్రతినిధులు అభివర్ణించారు. కవిటిలో విజయోత్సవాన్ని నిర్వహించి మిఠాయిలు పంచిపెట్టి సంబరాలు జరుపుకున్నారు.

మంచినీరు అందించాలని వినతి


కమిషనర్ రామారావుకు వినతిని అందజేస్తున్న వార్డు ప్రజలు

కాశీబుగ్గ: మంచినీటి సమస్యను పరిష్కరించాలని పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీ 31వవార్డు ప్రజలు కోరారు. ఈ మేరకు మున్సిపల్ కమిషనర్ నడిపేన రామారావును తన కార్యాలయంలో సోమవారం కలిసి వినతిపత్రం అందజేశారు. 31వ వార్డులో సుమారు రెండు వేల మంది ప్రజలు నివసిస్తున్నామని.. అయితే మంచినీటి ఎద్దడిని ఎదుర్కొంటున్నట్టు కమిషనర్‌కు వివరించారు. కౌశల్యానగర్, హరిజనవీధిలో పరిస్థితి మరీ ఘోరంగా ఉందన్నారు. కమిషనర్ మాట్లాడుతూ.. కౌశల్యనగర్‌కు బోరు వేసి ఉన్నారని మోటార్‌ను అమర్చుతామని, హరిజనవీధికి ఇక్కడి నుంచే మంచినీటిని సరఫరా చేస్తామని హామీ ఇచ్చారు. స్థానిక పెద్దలు కొరికాన శంకర్, బోనెల భైరాగి, రమణ, తివడాన శంకర్, జోగి జనార్దన్, దేవా సింహాచలం, జోగి రాజు, దేవ తులసమ్మ, రూపమ్మ, ఉర్నాన రమణ ఉన్నారు.

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు


జెన్నాగాయిలో పశువులకు వ్యాక్సినేషన్ ప్రక్రియను పరిశీలిస్తున్న అప్పలస్వామి

కంచిలి: పశువులకు విధిగా వ్యాధి నిరోధక టీకాలు వేయించాలని పశువైద్యశాఖ సోంపేట సబ్‌డివిజన్ సహాయ సంచాలకులు డాక్టర్ కె.అప్పలస్వామి అన్నారు. ఈ నెల ఒకటి నుంచి 30వ తేదీ వరకు నిర్వహిస్తున్న ప్రత్యేక డ్రైవ్‌లో భాగంగా జెన్నాగాయి, బొనమాళి, బొగాబెణి గ్రామాల్లో 250 పశువులకు వ్యాధినిరోధక టీకాలను సోమవారం మండల పశువైద్యశాఖ ఆధ్వర్యంలో వేశారు. గాలికుంటు, బ్రూసెల్లా వ్యాధి నిరోధక టీకాలను పశువులకు ఉచితంగా వేస్తున్నామని.. వీటిని సద్వినియోగం చేసుకోవాలని మండల పశువైద్యాధికారిణి డాక్టర్ టి.శిరీష సూచించారు. పశువైద్య సిబ్బంది డేనియల్, వలి, రబియా, రైనా పాల్గొన్నారు.

నిబంధనలు ఉల్లంఘిస్తే భారీ జరిమానా


కవిటి: మాట్లాడుతున్న ఎస్సై రవివర్మ

కవిటి: రోడ్డు నిబంధనలు ఉల్లఘించేవారికి భారీగా జరిమానాలు విధిస్తామని కవిటి ఎస్సై వి.రవివర్మ హెచ్చరించారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా రాష్ట్రంలో మోటారు వాహనాల చట్టంలో విప్లవాత్మక సంస్కరణలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. ఈ మేరకు విలేకరులతో సోమవారం మాట్లాడారు. హెల్మెట్, లైసెన్స్, బీమా లేకుండా, ట్రిపుల్ రైడింగ్, ఓవర్‌లోడ్ రైడింగ్ తదితర విషయాల్లో ఇప్పటి వరకూ అమలు చేస్తున్న జరిమానాలను భారీగా ప్రభుత్వం పెంచినట్టు పేర్కొన్నారు. కనీస జరిమానా రూ. వెయ్యి నుంచి పది వేల రూపాయల వరకూ ఉంటుందన్నారు. అలాగే తొలిసారి పట్టుబడినప్పు డు వేసే జరిమానా కంటే రెండోసారి పట్టుబడితే మరింత ఎక్కువ ఉంటుందని ఎస్సై వివరించారు. ప్రధాన కూడళ్లలో నేరాల నియంత్రణలో భాగంగా సీసీ కెమెరాల ఏర్పాటుకు ప్రజల భాగస్వామ్యం కోరుతున్నామన్నారు. వాహనాల భద్రత విషయంలో ఎవరికివారే జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

రోడ్డు నిబంధనలు పాటించాలి


సోంపేట: అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సోంపేట: వాహనదారులు రోడ్డు నిబంధనలు పాటించాలని సోంపేట ఎస్ఐ లవరాజు అన్నారు. స్థానిక బస్టాండ్ వద్ద ద్విచక్ర వాహదారులకు రోడ్డు నిబంధనలు, రవాణా చట్టాలపై సోమవారం అవగాహన కల్పించారు. ప్రతిఒక్కరు విధిగా హెల్మెట్ ధరించాలన్నారు. అధికవేగం, ప్రమాదకరమైన డ్రైవింగ్ చేసినా జరిమానా తప్పవన్నారు. నిబంధనలు పాటించి పోలీసులకు సహకరించాలని కోరారు.

సంక్షిప్తంగా...

సార్వత్రిక ఇంటర్ పరీక్షలు ప్రారంభం

ఇచ్ఛాపురం: మున్సిపల్ బాలికోన్నత పాఠశాల కేంద్రంగా సార్వత్రిక ఇంటర్మీడియెట్ మొదటి సంవత్సరం పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. 138మందికి 115మందే పరీక్షలకు హాజరయ్యారు.

వీఆర్‌ఏ మృతికి సంతాపం

కవిటి: కవిటి వీఆర్‌ఏ జడ్డెడ కేశవరావు(70) ఆదివారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ బెహరా మురళీమోహనరావు తన సిబ్బందితో సోమవారం కేశవరావు కుటుంబ సభ్యులను పరామర్శించి సంతాపం తెలియజేశారు. ప్రభుత్వం తరఫున అంత్యక్రియల ఖర్చులను కుటుంబ సభ్యులకు అందజేశారు.

ముగిసిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు

పలాస: బొడ్డపాడు గ్రామంలో మూడు రోజులుగా జరిగిన రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలు సోమవారం రాత్రితో ముగిశాయి. పోటీల్లో రాష్ట్ర వ్యాప్తంగా 30 జట్లు పాల్గొన్నాయి. సెమీఫైనల్‌లో బొడ్డపాడు జెస్సీ ఈవెంట్ టీం వైజాగ్ వాయిరియర్స్ తలపడగా జెస్సీ ఈవెంట్స్ గెలిపొందింది. అలాగే విజయనగరం, బాహాడపల్లి జట్ల మధ్య పోటీ జరగగా ఇందులో బాహాడపల్లి విజయం సాధించింది. ఫైనల్‌లో బొడ్డపాడు, బాహాడపల్లి జట్లు తలపడ్డాయి. అయితే విజేతను ప్రకటించలేదు. కార్యక్రమంలో బొడ్డపాడు యువజన సంఘం అధ్యక్షుడు తామాడ క్రాంతి, జైభీమ్ యువజన సంఘం అధ్యక్షుడు కిక్కర డిల్లీరావు, బొడ్డపాడు మాజీ సర్పంచ్ తామాడ త్రిలోచన పాల్గొన్నారు.

ప్లాస్టిక్ అమ్మకాలను నియంత్రించండి

కాశీబుగ్గ: పలాస–కాశీబుగ్గ మున్సిపాలిటీలో ప్లాస్టిక్ వాడకాన్ని నిషేధించడానికి చర్యలు తీసుకోవాలని కమిషనర్ నడిపేన రామారావు అన్నారు. ప్లాస్టిక్ విక్రయాలు జరగకుండా ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్సు, టాస్క్ ఫోర్స్ కోఆర్డినేటర్లతో కమిషనర్ సమీక్షా సమావేశాన్ని సోమవారం నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని పూర్తిగా నివారించేందుకు ప్రజలను, వ్యాపారస్తులను చైతన్యపరచాలన్నారు.

● ఆకట్టుకున్న సైన్స్ ప్రదర్శనలు

మండలస్థాయి వైజ్ఞానిక ప్రదర్శనలను సోమవారం పలు పాఠశాలల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన యూనిట్లు ఆకట్టుకున్నాయి. క్విజ్ తదితర పోటీలను నిర్వహించి విజేతలకు బహుమతులను ప్రదానం చేశారు. ఎంఈవోలు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

–సాక్షినెట్ వర్క్


ఇచ్ఛాపురం మున్సిపల్ పాఠశాలలో సైన్స్ ప్రాజెక్టులను పరిశీలిస్తున్న ఎంఈవోలు అప్పారావు, విశ్వనాథం